నిర్ణీత సమయంలో సమస్యల పరిష్కారం

పరిపాలనాధికారి కొక్కిసేన్ అనిల్

నూజివీడు టౌన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించటం జరుగుతుందని ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పరిపాలన అధికారి కొక్కిసేన్ అనిల్ తెలిపారు. నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో పరిపాలన అధికారికి అందించారు. ఈ సందర్భంగా పరిపాలన అధికారి అనిల్ మాట్లాడుతూ ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు అన్ని సమస్యలు పరిష్కరించటం జరుగుతుందన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజలు మొత్తం 22 రకాలైన సమస్యలను అర్జీల రూపంలో అందించినట్లు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

చిరుద్యోగులకు పథకాలు కట్..!

ప్రభుత్వాలు మారినా చిరుద్యోగుల బతుకుల్లో మాత్రం మార్పు రావడం లేదు. అత్తెసరు జీతాలతో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్ల పట్ల ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా మారింది. నెలకు రూ.ఏడు వేలు, రూ.11 వేలు, రూ.13 వేలు జీతం తీసుకుంటున్న ఉద్యోగులకు సైతం ప్రభుత్వ పథకాలు ఇవ్వకుండా నిలుపుదల చేయడం అత్యంత దారుణమనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఏఒక్క ప్రభుత్వ పథకమూ చిరుద్యోగులకు దక్కకపోవడంతో ఆయా కుటుంబాలు పడుతున్న ఆర్థిక కష్టాలు వర్ణనాతీతం.

వైసిపి బాటలోనే కూటమి ప్రభుత్వం తీరు

కాంట్రాక్ట్, స్కీమ్ వర్కర్లకు ప్రభుత్వ పథకాలు పూర్తిగా నిలిపివేత

రూ. ఏడు వేలు జీతం అందుకునే అంగన్‌వాడీ ఆయాలకు తల్లికి వందనం కట్

వైద్యమిత్రల వేతనం రూ.13 వేలు, వర్తించని ఏఒక్క పథకం

కుటుంబ సభ్యులకు పెన్షన్, పిల్లలకు ఫీజు రీయంబర్స్‌మెంట్‌తో సహా అన్నీ నిలుపుదల

రేషన్ కార్డుల్లో వివాహమైన పిల్లల పేర్లు సైతం తొలగించని దుస్థితి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 6,500 మందికిపైగా అంగన్‌వాడీలు పని చేస్తున్నారు. వివిధ శాఖల్లో వేల సంఖ్యలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. అంగన్‌వాడీల జీతం రూ.11,500, ఆయాల జీతం రూ.ఏడు వేలు. వీరికి ప్రభుత్వం పథకాలను నిలిపివేసింది. గత ప్రభుత్వం అంగన్‌వాడీ ఆయాలకు అమ్మఒడి ఇవ్వగా, ఈ ప్రభుత్వం ఆయాలకు సైతం తల్లికి వందనం నిలిపివేసింది. వైద్యమిత్రల జీతం నెలకు రూ.15 వేలు. చేతికొచ్చేది రూ.13 వేలు మాత్రమే. పెరిగిన ఖర్చులతో పోలిస్తే వైద్యమిత్రలకు ఇచ్చే జీతం నెలవారీ ఖర్చులకు ఏమాత్రం చాలని పరిస్థితి. వైద్యమిత్రలకు సైతం ప్రభుత్వ పథకాలు గత ప్రభుత్వం నుంచి నిలిచిపోయాయి. వీరే కాదు. తక్కువ జీతాలకు పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్ల కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదు. దీంతో ముఖ్యంగా

పిల్లల చదువుల విషయంలో చిరుద్యోగులు తీవ్రంగా నలిగిపోతున్నారు. చిరుద్యోగుల రేషన్ కార్డుల్లో ఉన్న తల్లిదండ్రులకు 60 ఏళ్లు దాటినా పెన్షన్ రావడం లేదు. రేషన్‌కార్డుల్లో పేర్ల తొలగింపు వంటి ప్రక్రియ సైతం జరగడం లేదు. పిల్లలకు వివాహాలు అయిపోయాయని, వారి పేర్లను తమ కార్డుల్లో నుంచి తొలగిస్తే ప్రత్యేక కార్డు తీసుకుంటారని, ప్రయత్నిస్తే జరగడం లేదు. అదేమని అడిగితే ఆన్‌లైన్‌లో కావడం లేదని సచివాలయ ఉద్యోగులు సమాధానం ఇస్తున్నారు. దీంతో ఏం చేయాలో, ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. చిరుద్యోగుల గురించి ప్రభుత్వం ఏమాత్రం ఆలోచించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంతోమంది బడాబాబులు పెద్దపెద్ద వ్యాపారాలు చేస్తూ నెలకు రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. అయినప్పటికీ వారికి తెల్లరేషన్‌కార్డుతోపాటు, ప్రభుత్వ పథకాలన్నీ ఇస్తున్నారు. గ్రామాల్లో భూస్వాములు అన్ని పథకాలనూ తీసుకుంటున్నారు. చిరుద్యోగులను మాత్రం ప్రభుత్వం తీవ్రంగా హింసిస్తోంది.

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిగా నమోదు తీస్తేనే న్యాయం

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసింది. దీంతో రేషన్‌కార్డుల్లో మార్పుల కోసం సచివాలయాలకు వెళితే ఎంప్లాయి అని వస్తుందని, సాధ్యం కాదని చెబుతున్నారు. రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే వేతనంలో ఒకటో వంతు కూడా చిరుద్యోగులకు అందడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులకు అందే ఏఒక్క సదుపాయమూ వీరికి అందదు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వీరిని తొలగించి తమకు కావాల్సిన వారికి నాయకులు నియమించుకుంటున్నారు. అటువంటప్పుడు ప్రభుత్వ ఉద్యోగులుగా ఏవిధంగా చెబుతారో అర్థం కావడం లేదు. ఆన్‌లైన్‌లో ప్రభుత్వ ఉద్యోగి అనే తొలగిస్తే తప్ప చిరుద్యోగులకు న్యాయం జరిగే పరిస్థితి కన్పించడం లేదు. దీనిపై అంగన్‌వాడీలు వారంరోజుల్లో తీవ్ర ఆందోళనలకు సైతం దిగుతున్న పరిస్థితి ఉంది.

నేడు, రేపు కొల్లేరులో సుప్రీం సాధికారిత కమిటీ

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ వెట్రిసెల్వి



కొల్లేరు మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

కొల్లేరులో వాస్తవ పరిస్థితులు పరిశీలించేందుకు ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లాలో సుప్రీంకోర్టు నియమించిన సాధికారిత కమిటీ పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం సాధికారిత కమిటీ పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా నిడమర్రు మండలం తోకలపల్లి, మండవల్లి మండలం మణుగూరు, పులపర్రు, కైకలూరు మండలం ఆటపాక, ఆలపాడు, కొల్లేటికోట ప్రాంతాల్లో కలెక్టర్ వెట్రిసెల్వి పర్యటించారు. ఆమెతోపాటు కైకలూరు ఎంఎల్‌ఎ డాక్టర్ కామినేని శ్రీనివాసరావు, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొల్లేరుకు సంబంధించిన సుప్రీం సాధికారిత కమిటీ ఈ నెల 17, 18 తేదీల్లో కొల్లేరులోని కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేయనున్నట్లు తెలిపారు. కొల్లేరులో ఎన్ని నివాసిత ప్రాంతాలు ఉన్నాయి, జిరాయితీ భూములు, డి.ఫారం పట్టా భూములు ఏమున్నాయి, 2006 సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఎలా అమలు చేశారనే అంశాలను కమిటీ పరిశీలించనుందన్నారు. పర్యటన అనంతరం బుధవారం ఏలూరు కలెక్టరేట్‌లో కొల్లేరుకు సంబంధించిన వినతులను స్వీకరిస్తారన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలంలోని కొల్లేరువాసులు కూడా తమ వినతులను అందజేయవచ్చన్నారు. కైకలూరు ఎంఎల్‌ఎ డాక్టర్ కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ కమిటీ మంగళవారం కైకలూరు ప్రాంతంలోని ఆటపాక, కొల్లేటికోట, బుధవారం నిడమర్రు ప్రాంతంలో జిరాయితీ భూముల్లో పర్యటిస్తుందన్నారు. ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గ కొల్లేరువాసులు బుధవారం ఏలూరులో కమిటీకి వినతులు అందజేస్తారన్నారు. వారి వెంట ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, డిఎఫ్‌ఒ (వైల్డ్ లైఫ్) బి.విజయ ఉన్నారు.

అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

వినతులు స్వీకరిస్తున్న జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలను నాణ్యతతో నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)లో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జెసితోపాటు డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ శ్రీహరి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.భాస్కర్, దేవకిదేవి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా అందిన దరఖాస్తులకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. నిబంధనల మేర ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, నిబంధనల మేరకు లేని దరఖాస్తులను అందుకు గల కారణాలను స్పష్టంగా దరఖాస్తుదారునికి తెలియజేయాలని అన్నారు. ఈ సందర్భంగా వచ్చిన అర్జీల్లో కొన్ని జంగారెడ్డిగూడెం మండలం పేరంపేటకు చెందిన రాచర్ల విజయకుమారి తనకు షేక్ మస్తాన్ కువైట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.2.50 లక్షలు తీసుకున్నాడని, ఇప్పటి వరకు ఎటువంటి సమాచారం లేదని ఫిర్యాదు చేశారు. పెదవేగికి చెందిన బొల్లికొండ శ్రీనివాసరావు తన అర్జీలో పెదవేగి పిహెచ్‌సి ఆవరణలోని భూమి సుమారు 60 సెంట్లు ఆక్రమణలకు గురైందని, డిఎంహెచ్‌ఒ దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

జెసి తీరు నిరసిస్తూ నినదిస్తున్న పేదలు, నేతలు

పేదలపై జెసి కన్నెర్ర..!

పేదలకిచ్చిన స్థలాల్లో పోలీస్ స్టేషన్‌కు స్థలం కేటాయింపుపై పిజిఆర్ఎస్‌లో మండవల్లివాసుల ఫిర్యాదు

తమ స్థలాలు కాపాడాలని అడిగిన పేదలపై బ్లాక్‌మెయిల్ చేస్తున్నారంటూ జెసి ఆగ్రహం

పట్టాలు ఉన్నాయని చెబుతున్నా చూపించండని అసహనం

పేదలకిచ్చిన స్థలాల్లో పోలీస్‌స్టేషన్‌కు స్థలం మళ్లించొచ్చా?

ఫిర్యాదు ఇచ్చిన అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్

'తమకు న్యాయం చేయాలని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేసిన మండవల్లి తరుగుమూల ఇందిరమ్మ కాలనీ లబ్ధిదారులైన పేదలపై జాయింట్ కలెక్టర్ (జెసి) ధాత్రిరెడ్డి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేయడం బాధితులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. 'ఏం జరిగిందో.. న్యాయ, అన్యాయాలు ఏమిటో తెలుసుకోకుండా పేదలను 'బ్లాక్‌మెయిల్ చేస్తున్నారా' అంటూ జెసి వ్యాఖ్యానించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. తమకు న్యాయం చేయండని పేదలు వస్తే ఉన్నతాధికారే ఇష్టానుసారంగా మాట్లాడటం బాధితులను తీవ్రంగా కలిచివేసింది. పేదల గోడు ఏమాత్రం వినకుండా అసహనం వ్యక్తం చేస్తూ 'మీకు పట్టాలు ఉంటే చూపించండి, మీరు అర్హులైతే దరఖాస్తు పెట్టుకుంటే వేరేచోట స్థలాలు ఇస్తారు' అంటూ జెసి అనడంతో లబ్ధిదారులు అవాక్కయ్యారు.

మండవల్లి శివారు తరుగుమూల లేఅవుట్‌లో పేదలకు ఇచ్చిన ఇందిరమ్మ కాలనీ స్థలాల్లోని కామన్ (అవసరాల నిమిత్తం కేటాయించిన) స్థలాన్ని పోలీస్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించడం దారుణమని, ఇందిరమ్మ కాలనీ లబ్ధిదారులకు అన్యాయం చేయొద్దని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం మండవల్లి తరుగుమూల ఇందిరమ్మ కాలనీ లబ్ధిదారులు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ లేకపోవడంతో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జెసి ధాత్రిరెడ్డికి బాధితులు ఫిర్యాదు అందించారు. ఈ నేపథ్యంలో బాధితుల గోడు వినకుండా జెసి స్పందించిన తీరుతో అవాక్కయిన పేదలు, జిల్లా అధికారులే ఇలా మాట్లాడితే తమ సమస్యను ఇంకెవరికి చెప్పుకోవాలని వాపోయిన పరిస్థితి. దీంతో తమకు న్యాయం జరిగేవరకూ పోరాటం చేస్తామని పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు ఇచ్చిన అనంతరం కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో బాధితులంతా ఆందోళన నిర్వహించారు. తమ స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పోలీస్ స్టేషన్ నిర్మాణం ఆపాలని, తమ స్థలాలు పూడిక చేసి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించాలని నినదించారు.

కామన్ సైట్ ఏవిధంగా కేటాయిస్తారు..?

కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 2006లో అప్పటి ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పేరుతో 131 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారన్నారు. ఆ స్థలాలు లోతట్టు ప్రాంతంలో ఉండటంతో లెవెలింగ్ చేసి ఇందిరమ్మ గృహాల పేరుతో వెంటనే ఇళ్లు నిర్మించి ఇస్తామంటూ స్థల పట్టాలను గృహనిర్మాణ శాఖ తీసుకుందన్నారు. 20 సంవత్సరాలుగా పేదల స్థలాలను మెరక చేయకుండా, ఇళ్లు నిర్మించకుండా ప్రభుత్వాలు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. లబ్ధిదారుల అవసరార్థం బడి, గుడి, కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసుకునేలా 40 సెంట్లు కామన్ స్థలం కూడా ఏర్పాటు చేశారని, ఆ స్థలాన్ని పోలీస్‌స్టేషన్‌కు ఏవిధంగా కేటాయిస్తారని ప్రశ్నించారు. 20 ఏళ్లుగా గృహనిర్మాణ శాఖ వద్ద ఉన్న పట్టాలైనా ఇచ్చి స్థలం మెరక చేయాలని 131 మంది లబ్ధిదారులు పోరాటం చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు అదే అక్కడే లబ్ధిదారుల అవసరార్థం ఏర్పాటు చేసిన కామన్ సైట్‌లో పోలీస్ స్టేషన్ నిర్మించేందుకు పంచాయతీ గుట్టుచప్పుడు కాకుండా తీర్మానం చేసిందని, ప్రభుత్వ అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇవ్వడం దారుణమని విమర్శించారు. ఇప్పటి వరకూ గుప్పెడు మట్టి వేయని అధికారులు పోలీస్ స్టేషన్‌కు ఆ ప్రాంతంలో స్థలం కేటాయించడంతో గంటల వ్యవధిలో ఆ స్థలాన్ని మట్టితో పూడిక చేయడం చూస్తే ప్రభుత్వాలకు పేదల పట్ల శ్రద్ధ ఏమిటనేది అర్థమవుతుందన్నారు. పేదలకు సంబంధించిన స్థలంలో పోలీస్ స్టేషన్ నిర్మాణాన్ని నిలుపుదల చేసి పేదల స్థలాలు మెరక చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, గృహనిర్మాణ శాఖ వద్ద ఉన్న పేదల పట్టాలు పేదలకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోట జయ, ముక్కు అలివేలు మంగమ్మ, చిగురుపాటి చింతామణి, అవనిగడ్డ వెంకటేశ్వరమ్మ, మాణిక్యం, పద్మ, మరీదు కనకదుర్గ, ఎన్.బుజ్జమ్మ, కసిరెడ్డి ప్రసన్న, జి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

జులై 31 వరకు అతిసార నివారణపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు

అతిసార వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 16వ తేదీ నుండి జులై 31వ తేదీ వరకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో సోమవారం 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్'పై ముద్రించిన వాల్‌పోస్టర్‌ను జెసి అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా జెసి ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో కలుషిత నీటి కారణంగా అతిసార వ్యాధి ప్రబలే అవకాశం ఉందని, దీని కారణంగా జిల్లాలో ఎటువంటి మరణాలు సంభవించకుండా నివారించాలనేది జిల్లా యంత్రాంగం లక్ష్యమని అన్నారు. ఇంటింటికి సర్వే నిర్వహించి ఐదేళ్లలోపు వయస్సు కలిగిన లక్షా 44 వేల 422 మంది పిల్లలకు రెండు ఒఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, రక్షిత తాగునీరు తీసుకోవడంతోపాటు అతిసార వ్యాధి సోకితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అతిసార నివారణపై ప్రచురించిన పోస్టర్‌ను అన్ని ప్రధాన కూడళ్లలో ప్రదర్శించాలన్నారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ మాలిని, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, జిల్లా ఇమ్యునైజేషన్ ఇన్‌ఛార్జి అధికారి డాక్టర్ రాజీవ్ పాల్గొన్నారు.

ఎల్‌టిఆర్, 1/70 భూములకు పట్టాలివ్వాలి

భూవివాదాల పరిష్కారానికి టైటిల్ వెరిఫికేషన్ చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - పోలవరం

ఏజెన్సీ భూవివాదాలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏజెన్సీ భూవివాదాలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ 30 సంవత్సరాల నుండి ఎల్‌టిఆర్, 1/70 చట్ట భూములను సాగు చేస్తున్న గిరిజనులను సాగుదార్లుగా రికార్డుల్లో నమోదు చేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతంలో అన్ని హక్కులు గిరిజనులకే ఉన్నాయంటూ చట్టాల అమలులో గిరిజనులకు తీవ్ర నష్టం చేస్తున్నారన్నారు. గిరిజనుల కోసమే ఉన్నామంటూ గిరిజనేతరులకు రెవెన్యూ అధికారులు కొమ్ముకాయడం దుర్మార్గమన్నారు. తహశీల్దార్‌కు గిరిజన చట్టాలపై కనీస అవగాహన లేదన్నారు. ఏజెన్సీ భూవివాదాల పరిష్కారం కోసం టైటిల్ వెరిఫికేషన్ చేయాలని సూచిస్తే ఎస్‌డిసి వద్దకు వెళ్లాలని తహశీల్దార్ బాధ్యతారాహిత్యంగా సమాధానమిస్తున్నారని విమర్శించారు. ఏజెన్సీలో గిరిజన చట్టాలపై అవగాహన కలిగిన అధికారులను ప్రభుత్వం నియమించాలని డిమాండ్ చేశారు. ఇటికలకోట గ్రామంలో అటవీ హక్కు చట్టం 2006 ప్రకారం కొందరికి వ్యక్తిగత పట్టాలు ఇచ్చిన ఫారెస్ట్ అధికారులు ఆ భూములకు సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయడమేమిటని ఆయన ప్రశ్నించారు. 2006 అటవీహక్కుల చట్ట ప్రకారం పోడు సాగు చేస్తున్న వారందరికీ వ్యక్తిగత పట్టాలు ఇవ్వాలని చట్టం చెబుతుంటే ఇక్కడ ఫారెస్ట్ అధికారులు చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తక్షణమే పోడు భూముల సాగుదార్లకు హక్కు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ వింజరం గ్రామంలో పాత జిసిసి రేషన్‌షాప్ శిథిలావస్థలో ఉందని, రేషన్ షాప్ కొత్త భవనం నిర్మించాలని అన్నారు. కొమ్ముగూడెం, వింజరం, కోయనాగంపాలెం గ్రామాలకు శ్మశాన వాటికలు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ బి.సాయిరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు బొరగం భూచంద్రరావు, టి.శాంతికుమారి, జి.పాండవులు, డి.లక్ష్మి, కె.రాజు, డి.సుబ్బాయమ్మ, ఎం.గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

నినదిస్తున్న నేతలు, గిరిజనులు

ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంచాలి

వ్యకాస ఆధ్వర్యాన ధర్నా



వినతులు స్వీకరిస్తున్న జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సులు అమలు చేయాలని, మండలంలో అన్యాక్రాంతమైన అసైన్డ్, సీలింగ్, ప్రభుత్వ పోరంబోకు, హెచ్‌ఒ, పిడబ్ల్యుడి భూములను రెవెన్యూ శాఖ స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంచాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత ఆగిరిపల్లి ప్రజాసంఘాల కార్యాలయం నుండి హైస్కూల్ సెంటర్ మీదుగా ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. ముఖ్యఅతిథి వ్యకాస జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. 30 ఏళ్ల నుండి పేదలు ఈ భూముల కోసం పోరాడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మండలంలో అసైన్డ్, సీలింగ్, ప్రభుత్వ పోరంబోకు, హెచ్‌ఒ, పిడబ్ల్యుడి తదితర భూములను భూస్వాముల నుండి స్వాధీనం చేసుకోవాలన్నారు. అక్రమంగా, దర్జాగా, చట్ట విరుద్ధంగా ఈ భూములను అనుభవిస్తున్న వారిపై పట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదల భూములు భూస్వాములు ఆక్రమించుకుంటే రెవెన్యూ అధికారులు మొద్దు నిద్రపోతున్నారని విమర్శించారు. మండలంలో చిన్న ఆగిరిపల్లి, వట్టిగుడిపాడు, సూరారం, తోటపల్లి, అడవినెక్కలం తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు, అటవీ భూములు భూస్వాముల కనుసనల్లో ఉన్నాయని తెలిపారు. ఒక్క చిన్న ఆగిరిపల్లి గ్రామంలోనే సుమారు 592.15 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిని వెంటనే రెవెన్యూ శాఖ స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలందరికీ పంచాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో అన్ని ప్రజా సంఘాలను కలుపుకుని ఈ భూముల కోసం పోరాడుతామని, భూమిలేని పేదలకు భూమి పంచే వరకు పెద్దఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని అధికారులను హెచ్చరించారు. ఈ ధర్నాకు సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు, రైతుసంఘం నాయకులు పాపారావు, వ్యకాస నాయకులు సత్తు కోటేశ్వరరావు సంఘీభావం తెలిపి మాట్లాడారు. పేదల పక్షాన రైతులు, కార్మికులు అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అర్జున్‌రావు, కుమారి, మేరీ, సుబ్బారావు, రంగారావు పాల్గొన్నారు.

సాంకేతికత ఆధారంగా నేరాల నియంత్రణ : ఎస్‌పి



చోరీ సొత్తును అందజేస్తున్న ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

జంగారెడ్డిగూడెం: నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలకు సాంకేతికను వినియోగిస్తున్నామని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. జంగారెడ్డిగూడెంలో సోమవారం జిల్లా ఎస్‌పి పర్యటించారు. పోలీస్ స్టేషన్లో సీసీ కెమెరాల సిస్టమ్‌ను ప్రారంభించి, అనంతరం డిఎస్‌పి కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మత్తు పదార్థాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాకై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్‌కౌంటర్‌ల నేపథ్యంలో జిల్లాలో షెల్టర్ జోన్ ప్రాంతాలలో కుంబింగ్ చేపట్టామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో భద్రతను పటిష్టం చేసామన్నారు. అనంతరం జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలో జరిగిన చోరీ కేసులలో చోరీ సొత్తు 323.670 గ్రాముల బంగారం, రూ.6,30,092 నగదు, ఒప్పో ఫోన్ ఆండ్రాయిడ్ మొబైల్ ఒకటి బాధితులకు ఎస్‌పి అందజేసినట్లు జంగారెడ్డిగూడెం పోలీసులు తెలిపారు. పోలీసు వారికి బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు. పబ్లిక్ గ్రీవెన్స్‌లో ప్రజలు అనేక సమస్యలు ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డిఎస్‌పి, డివిజన్ పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా ప్రజా రవాణా అధికారిగా ఎస్‌కె.షబ్నం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపిఎస్‌ఆర్‌టిసి ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారిగా ఎస్‌కె.షబ్నం సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాజమండ్రి డిపో మేనేజర్‌గా పని చేస్తున్న ఆమె ఉద్యోగోన్నతిపై ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారిగా నియమితులై బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు సమీపంలోని దొమ్మేరుకు చెందిన ఆమె గణితంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అనంతరం 2011లో కర్నూలు జిల్లా నందికొట్కూరు డిపో మేనేజర్‌గా తొలిసారి విధుల్లో చేరిన ఆమె అక్కడ సంవత్సరంపాటు పని చేశారు. అనంతరం రాజోలు డిపో మేనేజర్‌గా మూడు సంవత్సరాలు, రావులపాలెం డిపో మేనేజర్‌గా మూడు సంవత్సరాలు, తణుకు డిపో మేనేజర్‌గా మూడు సంవత్సరాలు, రాజమండ్రి డిపో మేనేజర్‌గా మూడున్నర సంవత్సరాలు పని చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపో మేనేజర్‌గా 14 సంవత్సరాలు పని చేసిన అనుభవం ఉందని, ప్రయాణికులకు కావాల్సిన మంచి బస్సులను ఏర్పాటు చేసి ప్రయాణంలో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటానని తెలిపారు. ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలకు మంచి కృషి చేస్తానని, ప్రయాణికులుగాని, సిబ్బందిగాని ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, కార్యాలయ సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు, పిఆర్‌ఒ నరసింహం పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతన బకాయిలు విడుదల చేయాలి

వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివ నాగరాణి

బుట్టాయిగూడెం : ఉపాధి పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివనాగరాణి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని జగ్గుశెట్టి వారిగూడెం, చెంచుగూడెం, రేకుల కుంట తదితర గ్రామాలలో ఉపాధి కూలీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా శివ నాగరాణి, ముత్యాలమ్మ మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికే రెండు నెలలు కావస్తున్నా పనిచేసిన కూలీలకు సకాలంలో వేతనాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరో పక్క ఉపాధి కూలీలకు చట్టప్రకారం 15 రోజులకు ఒకసారి వేతనం, పే స్లిప్ ఇవ్వాలని చట్టంలో ఉన్న దానిని అమలు చేయడం లేదని విమర్శించారు. జిల్లా అధికారులు మండలంలో ఉపాధి పనులలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్రత దర్యాప్తు చేయాలని కోరారు. కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు టెంట్, మంచినీరు, మజ్జిగ వంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఉపాధి కూలీలకు ఇవ్వాల్సిన వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న వి.శివ నాగరాణి, ముత్యాలమ్మ

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రాంబాబు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రాంబాబు తెలిపారు. ఈమేరకు జులై 9న దేశవ్యాప్తంగా ఒక రోజు సమ్మె బంద్‌కు పిలుపునిచ్చారు. 200 రోజుల పని, రూ.600 వేతనం, పని బకాయిల సమస్యల పరిష్కారం కోసం ఈ బంద్‌లో పాల్గొనాలని ఉపాధి కూలీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర పాలకవర్గాలు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నాయని రాంబాబు ఆరోపించారు. పోరాడి సాధించిన ఈ చట్టాన్ని రక్షించుకోవాలని, జులై 9న మండల కేంద్రాల్లో, గ్రామ సచివాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

కంటి వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు

కొయ్యలగూడెం : మండలంలోని అంకాలగూడెం గ్రామంలోని కొత్తపేట సెంటర్‌లో ఆమెన్ ట్రస్ట్, శంకర నేత్రాలయ(ఏలూరు) సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించి 150 మందికి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆమెన్ ట్రస్ట్ ఛైర్మన్ ఇవాంజలి మాట్లాడుతూ కంటి వ్యాధులకు చికిత్స అందించడంతో పాటు కళ్లజోళ్లు కూడా ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. శంకర నేత్రాలయ డైరెక్టర్ శర్వానంద్ మాట్లాడుతూ పోషకాహార లోపం, కంటికి కలిగే ఒత్తిడి వల్ల కంటి వ్యాధులు పెరుగుతున్నాయని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజారత్నం(ఆర్‌ఎంపి), ఆనంద్, శర్మ, బిందు, చక్రవర్తి, రోషన్ పాల్గొన్నారు.

విద్యాసంస్థ తప్పుకి రాని 'తల్లికి వందనం'

నూజివీడు టౌన్ : తన కుమారునికి తల్లికి వందనం నగదు రాలేదంటూ నూజివీడు పట్టణంలోని ముస్లిం బజారుకు చెందిన షేక్ రేష్మ ఆవేదన వ్యక్తం చేసింది. నూజివీడులో సోమవారం రేష్మ మాట్లాడుతూ 2024-25లో తన కుమారుడు అమానుల్లాను ఒకటవ తరగతికి ప్రయివేటు పాఠశాలలో చేర్పగా ఆన్‌లైన్‌లో యుకెజి అని నమోదు చేసి అన్యాయం చేశారని వాపోయింది. ఆ విద్యాసంస్థపై చర్యలు చేపట్టి తమకు తల్లికి వందనం నగదు ఇప్పించాలని కోరింది. ప్రయివేటు విద్యాసంస్థ చేసిన తప్పిదానికి నిరుపేద కుటుంబానికి చెందిన తాము ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి విద్యాసంస్థలపై ప్రభుత్వాధికారులు కఠినంగా వ్యవహరించి, తమలాంటి నిరుపేద కుటుంబాలకు సాయం చేయాలని ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం

హార్టికల్చర్ అధికారి ఆర్.హేమ

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని రైతులు ఉద్యాన తోటల పెంపకం కోసం ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు హార్టికల్చర్ అధికారి ఆర్.హేమ తెలిపారు. నూజివీడులో హేమ సోమవారం మాట్లాడుతూ మామిడి తోటలు, నిమ్మ తోటల పెంపకానికి హెక్టారుకు రెండు సంవత్సరాలకు గాను రూ.50 వేలు, జామ తోటల పెంపకానికి హెక్టారుకు రూ.80 వేలు, జీడి మామిడి, కోకో తోటల పెంపకానికి హెక్టారుకు రూ.30 వేలు, అరటి తోటల పెంపకానికి హెక్టారుకు రూ.70 వేలు, బొప్పాయి తోటల పెంపకానికి హెక్టారు రూ.30 వేలు, హైబ్రిడ్ కూరగాయలు పెంచేందుకు హెక్టారుకు రూ.24 వేలు, పువ్వుల సాగు, మల్చింగ్ విధానానికి హెక్టారుకు రూ.20 వేల నగదు ప్రభుత్వం సాయంగా అందించనుందని తెలిపారు. ఇందుకోసం నేరుగా స్థానికంగా ఉన్న రైతు సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేయాలన్నారు. దరఖాస్తుతో పాటు రైతులు 1బి, భూమి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, నేషనల్ బ్యాంక్ ఖాతా పుస్తకం నకలు కాపీలు, రైతు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జతచేయాలన్నారు.

'వేగంగా గృహ నిర్మాణాలు పూర్తి కావాలి'

నూజివీడు టౌన్ : ప్రభుత్వం అందించే అదనపు ఆర్థిక సహాయాన్ని అందిపుచ్చుకొని లబ్ధిదారులు వేగవంతంగా గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రామోజీ నాయక్ అన్నారు. నూజివీడులో ఆయన సోమవారం మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం అందించే రూ.1.80 లక్షల ఆర్థిక సాయం కాక ప్రస్తుత కూటమి పాలనలో రూ.2.30 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనకబడిన తరగతులకు చెందిన లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ సాయాన్ని లబ్ధిదారులు సకాలంలో అందిపుచ్చుకొని నాణ్యమైన రీతిలో వేగవంతంగా గృహ నిర్మాణాలను పూర్తిచేయాలని సూచించారు.

చదివిన పాఠశాలకే ఉపాధ్యాయులుగా..

ఉంగుటూరు : బాదంపూడి మోడల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా రేగాని రామకృష్ణ, సహ ఉపాధ్యాయులుగా అల్లు శ్రీను, శింగవరపు శ్రీను బదిలీపై వచ్చారు. వీరంతా అదే పాఠశాల పూర్వ విద్యార్థులు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలలో రేగాని రామకృష్ణ దేవరపల్లి నుంచి, అల్లు శ్రీను ఉప్పాకపాడు నుంచి, శింగవరపు శ్రీను బాదంపూడి నెం-3 నుంచి వచ్చారు. వీరు తాము చదివిన పాఠశాలకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పాఠశాల విద్యాభివృద్ధికి కృషిచేసి పాఠశాల ఎన్రోల్మెంట్ పెరుగుదలకు పాటుపడతామని అన్నారు. వీరు తమ స్వగ్రామం పాఠశాలకు రావడాన్ని గ్రామస్థులు అభినందించారు.

తిరుమలదేవి పేటలో అదనపు తరగతి గదులు ప్రారంభం

టి.నరసాపురం : మండలంలోని తిరుమలదేవిపేట గ్రామంలో మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిన తరుణంలో పాఠశాల అదనపు తరగతి గదులను గ్రామానికి చెందిన దాత తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ తన తండ్రి సుబ్బారావు జ్ఞాపకార్థం సొంత ఖర్చులతో నిర్మించారు. వాటిని సోమవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాల అదనపు తరగతి గదులు నిర్మాణం చేసిన తోట లక్ష్మీ నారాయణను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారిణి ఎస్.కళ్యాణి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూటాల పంపింగ్ స్కీమ్ నీటి విడుదల

పోలవరం : మండలంలోని పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల గ్రామాల ఆయకట్టు రైతుల సాగునీటి అవసరాలకు గూటాల పంపింగ్ స్కీం నుంచి నీటిని విడుదల చేసినట్లు నీటి సంఘం అధ్యక్షులు కరిబండి శ్రీనివాస్ సోమవారం తెలిపారు. నీటిసంఘం నిర్వహణ ఖర్చుల లావాదేవీల వివరాలు ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించి చర్చించడం జరిగిందన్నారు. ఖరీఫ్ సీజన్ ఆకుమడులు, ఇతర అవసరాలకోసం గోదావరి నీటిమట్టం 14 మీటర్లకు పైబడి ఉన్న నేపథ్యంలో గత రెండు రోజుల నుంచి ఒక మోటారు ద్వారా నీటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సుమారు రెండువేల ఎకరాలకు నీటి పంపిణీ జరిగిందన్నారు.

పురుషోత్తపట్టణం ఫెర్రీ రేవు బహిరంగ వేలం

పోలవరం : మండల కేంద్రంలో పోలవరం పురుషోత్తపట్నం ఫెర్రీ రేవు 2025-2026 సంవత్సరాలకు బహిరంగ వేలం ఈనెల 27న నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ చెరుకూరి శ్రీనివాస్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీల్డు టెండర్లు ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట లోపు కార్యాలయం పనివేళల్లో మండల పరిషత్ టెండరు బాక్సులో వేయాలని సూచించారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు సీల్డు టెండరు కవర్లు తెరవడం జరుగుతుందన్నారు. రూ.11,50,000తో పాట ప్రారంభమవుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు రూ.18 లక్షల సాల్వెన్సీతో సంబంధిత వివరాలకు కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

చెట్టు మొద్దు విరిగిపడి కూలీ మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్ :

చెట్టు నరుకుతున్న కూలీపై ప్రమాదవశాత్తు చెట్టు మొద్దు విరిగిపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అతను చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం విజయరాయి గ్రామంలో చోటుచేసుకుంది. సంబంధిత వివరాల ప్రకారం దెందులూరు మండలం గాలిగూడెం గ్రామానికి చెందిన యడ్లపల్లి రాటాలు 55 స్థానికంగా కూలి పనులు చేస్తూ భార్యాపిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. ఈక్రమంలో పెదవేగి మండలం విజయరాయి గ్రామంలో కొందరు కూలీలు తోటలో చెట్లు నరుకుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టు మొద్దు ఒకటి విరిగి రాటాలుపై పడింది. అతను తీవ్ర గాయాల పాలయ్యాడు. గమనించిన తోటి కూలీలు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పెదవేగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

చింతలపూడికి బాలికల పాఠశాల అవసరం..!

గర్ల్స్ హైస్కూల్‌గానే కొనసాగించాలి

బాలికల హక్కులు కాపాడాలి

జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల

ప్రజాశక్తి - చింతలపూడి

64 సంవత్సరాలుగా ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా పరిషత్ హైస్కూల్‌గా మార్చేశారు. పేద, మధ్యతరగతి బాలికల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే ఈ పాఠశాలను ఎందుకు మార్పులు చేశారో తెలియని పరిస్థితి. చింతలపూడికి బాలికల పాఠశాల అవసరం లేదని మార్చారా? లేదా ఎవరి స్వార్థం కోసం చేశారు? అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ పాఠశాలలో నియోజకవర్గం నుంచి కాకుండా ఇతర చుట్టుపక్కల నుంచి అధిక సంఖ్యలో బాలికలు చదువుతున్నారు. హాస్టల్ వసతి సౌకర్యం కూడా ఉండటంతో బాలికలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది.

మండలంలో 1961వ సంవత్సరం నుంచి బాలికలకు ఇంటిగ్రేటెడ్ వసతి సౌకర్యంతో ప్రభుత్వ బాలికల పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో 400 మందికిపైగా బాలికలకు ఉచిత హాస్టల్ సదుపాయం ఉంది. వీరిలో 90 శాతం మంది విద్యార్థులు ఎస్‌సి తరగతికి చెందిన వారే, అంతేకాకుండా ఆర్థికంగా కూడా వెనకబడిన వారు. వివిధ దూరప్రాంతాల బాలికలకు వసతి గృహం సౌకర్యం ఉండడంతో బాలికలకు, వారి తల్లిదండ్రులకు ఎంతగానో ఉపయోగపడేది. అలాంటి పాఠశాలను బాలబాలికల పాఠశాలగా మార్చేశారని, బాలికల హక్కులను కాపాడాలని ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు.

గత ప్రభుత్వంలో చింతలపూడిలో ఉన్న గాంధీ నగర్‌లో ప్రైమరి వరకు బాలురులను బాలికల పాఠశాలలో అనుసంధానం చేశారు. గత ప్రభుత్వంలో ప్రైమరి వరకు అనుసంధానం చేయటంతో సాంకేతిక సమస్యలు తలెత్తుతాయని, అందుకే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను విద్యాశాఖ ఉన్నతాధికారులు మార్పు చేశారని చింతలపూడి అధికారులు చెబుతున్నారు. పాఠశాల నిర్వహణ కమిటీ తీర్మానం, ఈ మార్పులకు వ్యతిరేకంగా ఎస్ఎంసి ఒక తీర్మానం ఆమోదించిందని పాఠశాల పేరును, బాలికల పాఠశాల ఆకృతిని కొనసాగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. జెడ్‌పి గర్ల్స్ హైస్కూల్ నుంచి జెడ్‌పి హైస్కూల్‌గా మార్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, బాలికల పాఠశాలగా కొనసాగించాలని మండల ప్రజలు బలంగా కోరుకుంటున్నారు. ఈ మార్పుల నేపథ్యంలో పురుష ఉపాధ్యాయులు ఈ పాఠశాలకు బదిలీ కోసం దరఖాస్తు చేస్తున్నారని, దీంతో మహిళా ఉపాధ్యాయులకు అవకాశాలు తగ్గిపోతున్నాయని, బాలికల పాఠశాలలో మహిళా ఉపాధ్యాయుల అవసరం మరింత ఉందని పలువురు విశ్లేషిస్తున్నారు. ఈ పాఠశాలలో 400 మంది బాలికలకు ఉచిత హాస్టల్ సౌకర్యం ఉంది. వీరిలో 90 శాతం మంది విద్యార్థులు ఎస్‌సి తరగతికి చెందిన వారే. బాలికల హక్కులను కాపాడేందుకు ఈ పాఠశాల ఒక వేదికగా నిలుస్తుందని పాఠశాలను గర్ల్స్ హైస్కూల్‌గానే కొనసాగించాలని ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

కలెక్టర్ స్పందించాలి

ఆర్‌విఎస్ నారాయణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు

మండలానికి బాలికల పాఠశాల అవసరం. ఈ హాస్టల్లో 400 మందికిపైగా బాలికలకు హాస్టల్ సదుపాయం ఉంది. ఈ పాఠశాల మార్పు బాలికలపై ప్రభావితం చూపిస్తుంది. జిల్లా కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు, చింతలపూడి జిల్లా గర్ల్స్ హై స్కూల్‌ను కొనసాగించే విధంగా కృషి చేయాలి. బాలికల హక్కులను కాపాడాలని కోరుతున్నాము.

నైపుణ్యం వెలికి తీయాలి : ఎంఎల్ఎ

జీలుగుమిల్లి : ఏజెన్సీప్రాంత క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీయాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో శాప్ డైరెక్టర్‌గా స్థానం దక్కించుకున్న పోలవరం మండలం సింగన్నపల్లికి చెందిన కొవ్వాసి జగదీశ్వరిను ఆదేశించారు. సోమవారం ఆమె మండలంలోని బర్రింకలపాడు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ జగదీశ్వరిని అభినందించారు.క్రీడాకారుల ప్రోత్సాహానికి తన వంతు సహాయం అందిస్తానని తెలిపారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పోడూరు మండలం, పండిత విల్లూరు గ్రామానికి చెందిన యిందుకూరి సరస్వతి భర్త యిందుకూరి త్రిమూర్తి రాజు డోర్ నెంబర్ 1-9 నకు చెందిన, హైదరాబాద్ వారు 22-06-2017 న **M4354218** నెంబర్ గల ఒరిజినల్ పాస్‌పోర్ట్ జారీ చేశారు. అయితే ఆ పాస్‌పోర్ట్ డామేజ్ కావడంతో **R0156524** నెంబర్ గల పాస్‌పోర్ట్‌ను జారీ చేయగా 13 -06-2025 తేదీన మా ఇంటి నుంచి పాస్‌పోర్ట్ జిరాక్స్ నిమిత్తం మోటర్ సైకిల్ పై వెళుతుండగా పాస్‌పోర్ట్ కలిగిన కవరు మార్గమధ్యంలో పడిపోయింది. ఆ కవర్లో హైదరాబాదు వారి జారీ చేసిన **R0156524** ఒరిజినల్ పాస్‌పోర్టు కలిగి ఉంది. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్ కు సంప్రదించగలరు.

యిందుకూరు సరస్వతి
తండ్రి: త్రిమూర్తి రాజు
డోర్ నెంబర్ 1-9
పంచాయితీ రోడ్డు, పండిత విల్లూరు
పోడూరు మండలం,
ప॥గో॥జిల్లా, పిన్ - 534122
సెల్ నెం: 94404 80938

హామీలు అమలు చేస్తూ ముందుకెళ్తున్నాం : ఎంఎల్ఎ

ఏలూరు సిటీ : కార్యదక్షతతో పనిచేసేందుకు అవసరమైన శక్తి సామర్థ్యాలు, నిబద్ధత కలిగిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూ ముందుకెళ్తోందని ఎంఎల్ఎ బడేటి చంటి వెల్లడించారు. అలాగే తల్లికి వందన పథకంలో అర్హతవుండీ ఇంకా లబ్ధిపొందని తల్లులకు కూడా నగదు జమ అయ్యేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఏలూరు 48, 49 డివిజన్ పరిధిలోని 3, 4 సచివాలయాలను ఆయన, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో ఎంఎల్ఎ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి అమలుచేసిన తల్లికి వందనం పథకంలోని అర్హుల జాబితాలోవుండి నగదు జమకాని వారికి ఎదురైన సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. తల్లికి వందనం పథకంలో అర్హుల జాబితాలో పేర్లు నమోదైనా నగదు జమకాని తల్లులు కొందరు ఉన్నారని, వారికి ఎదురైన సాంకేతిక సమస్యలను, ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సచివాలయాల సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీచేశామన్నారు. త్వరలోనే అర్హులైన మిగిలిన తల్లుల ఖాతాల్లో కూడా నగదు జమ అవుతుందని భరోసా ఇచ్చారు. 1వ తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు సంబంధించిన లబ్ధి ఈనెల 30వ తేదీన వారి తల్లుల ఖాతాల్లో జమ అవుతుందని ఆయన వెల్లడించారు. ఈ విషయంలో ఎవ్వరూ అధైర్యపడొద్దని, అర్హులందరికీ న్యాయం చేసేందుకు తాను కృషిచేస్తానని ఈ సందర్భంగా ఎంఎల్ఎ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

జుత్తిగ రఘురామ చంద్రమూర్తి, తండ్రి: ప్రసాద్, డోర్ నెంబర్ 1-39, దొంగరావి పాలెం, ఖండవల్లి, పెరవలి మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా

నేను వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి 15-06-2022న **V2888262** నెంబర్ పాస్‌పోర్ట్ తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్ పోర్ట్ ను తీసికొని ది 29-05-2025 న మా ఇంటి నుంచి పెరవలికు బస్‌లో జెరాక్స్ కాపీలు తీయించుటకు వెళ్ళగా దారిలో నా ఒరిజనల్ పాస్ పోర్ట్ పడిపోయింది. దారిలో ఎంత వెదికినా దొరకలేదు. కాబట్టి నా ఒరిజినల్ పాస్ పోర్ట్ ఎవరికైనా దొరికిన నా పై అడ్రస్‌కు అందజేయగలరు.

సెల్ నెం: 99639 56363

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పాఠశాలలు పున్ణ ప్రారంభమవడంతో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర పేరుతో 9 రకాల వస్తువులతో కలిపిన కిట్లను కూటమి నాయకుల ఆధ్వర్యంలో మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఎంపిపి పాఠశాలలో సర్పంచి సున్నం ఉషారాణి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అల్లాడి రాజు, వెంకటేష్, ఉపాధ్యాయ సిబ్బంది, ఎంపిటిసిలు సురేష్, సుధారాణి, కూటమి నాయకులు పి.వెంకటేశ్వరావు, కృష్ణ, నాగ్, నవీన్, కాంతారావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలుర హైస్కూల్)లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ మాట్లాడుతూ పాఠశాల విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ రాముడు, హెచ్ఎం, వార్డు కౌన్సిలర్స్ నంబూరి రామచంద్రరాజు, కరుటూరి రమాదేవి, తెలగారపు జ్యోతి, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరావు, రావూరి కృష్ణ, పెనుమర్తి రామ్‌కుమార్, షేక్ ముస్తఫా, మద్దిపాటి నాగేశ్వరావు, గుమ్మడి ప్రసాద్, అల్లూరి రామకృష్ణ పాల్గొన్నారు.

మండలంలోని లక్కవరం గ్రామంలోని జెడ్‌పి హైస్కూల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను కూటమి నాయకుల చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టి.నరసాపురం: ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వెలగపాడు పంచాయతీలోని వీరభద్రంవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫారం, పాఠ్యపుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వెలగపాడు సర్పంచి జలపాలు, మామిళ్ల అర్జునరావు, గుజ్జుల రామకృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముసునూరు : విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పిస్తున్నారని టిడిపి నాయకులు గరికిముక్కు నాని కొనియాడారు. సోమవారం మండలంలోని వేల్పుచర్ల గ్రామ పరిధిలోని పడమట హరిజన పాఠశాలలో చదివే విద్యార్థులకు బ్యాంగులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం హాన్నమణి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అన్నివేళలా అందుబాటులో ఉంటా..

మండల వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి

ముసునూరు : మండల వ్యవసాయ కార్యాలయంలో అన్నివేలలా అందుబాటులో వుంటూ రైతులకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తానని మండల వ్యవసాయాధికారిణి ఎ.చాముండేశ్వరి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీలో భాగంగా నూజివీడు మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తూ సోమవారం మండలకేంద్రమైన ముసునూరు వ్యవసాయ కార్యాలయ అధికారిగా బదిలీపై రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం అర్హులైన రైతులందరూ ఈనెల 20వ తేదీ లోపు మండలంలోని 16 గ్రామాల రైతు సేవా కేంద్రాల వద్ద ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. చేయించుకున్న రైతులు చెక్ చేసుకోవాలని తెలియజేశారు.

ఆపదలోని వారికి అండగా..

ఆగిరిపల్లి : మండలానికి చెందిన ఎస్.ముక్తేశ్వరరావు కేన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పార్వతీపురం మన్యం జిల్లాలోని పాచిపెంట మండల కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కొమిరి కృష్ణమూర్తి బాధిత కుటుంబం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు, కుమార్తె చదువు నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గతేడాది విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో ఇద్దరు వరద బాధిత కుటుంబాలకు రూ.2,500 చొప్పున రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గతంలో ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన ఎస్.బుజ్జి, కృష్ణవేణి కుటుంబాల్లోని పిల్లల చదువుల నిమిత్తం రూ.2,500 చొప్పున రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బుడమేరుకు వరదలు వచ్చిన సమయంలో నూజివీడు మండలంలో టి.కేశవులు కుటుంబానికి చెందిన ఇల్లు నీటిలో పూర్తిగా కొట్టుకుపోగా రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

శ్రీసుగుణ స్కూల్ ప్రారంభం

కలిదిండి : శ్రీ సుగుణ ఎడ్యుకేషనల్ సొసైటీ యాజమాన్యం ఆధ్వర్యంలో నూతనంగా కోట కలిదిండిలో శ్రీసుగుణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రారంభించినట్లు కరస్పాండెంట్ కె.రాజమణి తెలిపారు. విద్యతో పాటు నైతిక విలువలకు ప్రాధాన్యత ఇచ్చే రీతిలో విద్యా సంస్థను కొనసాగిస్తామన్నారు. ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, శ్రీసుగుణ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కె.సుజన్మయి సుగుణ, వైస్ ప్రెసిడెంట్ కె.తన్మయి సుగుణ ఉన్నారు.

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం, గూటాల గ్రామం మరియు శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం, పోలవరం గ్రామం, పోలవరం మండలం, ఏలూరు జిల్లా

భూముల సేద్యమునకు కౌలు హక్కునకు బహిరంగ వేలం ప్రకటన

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, గూటాల గ్రామములో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానమునకు మరియు పోలవరం మండలం, పోలవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం, సంపూర్ణ హక్కు భుక్తములో గల ఈదిగువ నుదహరించిన భూములను 2025-2026 నుండి 2027-2028 సంవత్సరమువరకు అనగా 3 సంవత్సరముల కాలమునకు కౌలుకు సేద్యము చేసుకొను హక్కునకు దేవదాయ ధర్మదాయ శాఖ చట్టం 30/1987 జి.ఓ.ఎం.ఎస్.నెం.3973రెవెన్యూ (ఎండోమెంట్స్-1) శాఖ, తేదీ. 11.03.2001 మరియు జి.ఓ.ఎం.ఎస్.నెం.425 (ఎండోమెంట్స్-1) శాఖ, తేదీ.09.11.2015 ప్రకారం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో యీ దిగువ తెలిపిన తేదీలలో బహిరంగ వేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు ఈక్రింది షరతులకు లోబడి వేలం పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము..

I శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం, పోలవరం గ్రామం.

వ. నెం.	భూమి యున్న గ్రామం, మరియు మండలం	సర్వే నెం.	విస్తీర్ణం య.సెం.	ధరావత్తు	బహిరంగవేలం జరుపు ప్రదేశం, తేదీ మరియు సమయము
1.	పెద్దేవం గ్రామం తాళ్ళపూడి మండలం	143/1	1.42	రూ.10,000	పెద్దేవం శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద ది.28.06.2025 ఉదయం గం.10.00 లకు

II శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం, గూటాల గ్రామం

వ. నెం.	భూమి యువ్వ గ్రామం, మరియు మండలం	సర్వే నెం.	విస్తీర్ణం య.సెం.	ధరావత్తు	బహిరంగవేలం జరుపు ప్రదేశం, తేదీ మరియు సమయము
1.	పరింపూడి గ్రామం, కొయ్యలగూడెం మండలం	168	5.10	రూ.10,000	కొయ్యలగూడెం శ్రీ మదన గోపాల స్వామి వారి దేవస్థానం వద్ద ది.28.06.2025 మధ్యాహ్నం గం 3.00 లకు

వేలంపాట షరతులు :

1. ఈ వేలం పాట సదరు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిచే ఉన్నతాధికారుల ఉత్తర్వులకు లోబడి నిర్వహించబడుచున్నది.
2. దేవస్థానమునకు ఏవిధమైన బకాయిలు వున్నవారుగానీ, దేవస్థానముతో ఎట్టి లావాదేవీలు వున్నవారుగానీ పాటలో పాల్గొనరాదు. పాట పాడుటకు తగిన అర్హత లేనివారిని పాటలో పాల్గొనకుండా చేయుటకు కార్యనిర్వహణాధికారి వారికి అధికారము కలదు.
3. అంగీకరింపబడిన పాటదారు పాటకొట్టివేసిన వెంటనే ఒక సం.రం శిస్తుసొమ్ము చెల్లించు నిర్ణయం.
4. ఇతర వివరములకు శ్రీ స్వామి వారి దేవస్థానం కార్యాలయము పనివేళలలో సంప్రదించవలెను.

ది.16.06.2025, గూటాల
కార్యనిర్వాహణాధికారి, సెల్ నెం. 99486 11144

పబ్లిక్ ప్రకటన

యిందుమూలముగా ప్రజలకు, భక్తులకు తెలియజేయునది ఏమనగా ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, సోమవరప్పాడు గ్రామ పంచాయితీ వీరభద్రపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ దాసాంజనేయస్వామి వారి దేవస్థానమును మరియు వాటి స్థిర చరాస్తులను హిందూ దేవాదాయ ధర్మదాయ శాఖ పరిధిలోనికి చేర్చి ఆంధ్రప్రదేశ్ చారిటబుల్ మరియు హిందు రిలిజియన్ ఇనిస్టిట్యూషన్స్ మరియు ఎండోమెంట్స్ చట్టం 1987 (చట్టం నెం. 30/1987) నందలి సెక్షన్ 6 ప్రకారం పబ్లికేషన్ మరియు సెక్షన్ 43 ప్రకారం రిజిస్ట్రేషన్ చేయుటకు గాను ఆలయ కమిటీ మరియు అర్చకులు కోరిన మేరకు నిర్ణయించుట జరిగినది. కావున యిందు విషయమై ఎవ్వరికైన, ఏమైన అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్నయెడల ఈ ప్రకటన ఇచ్చిన తేది నుండి పది(10) రోజుల లోపుగా లిఖిత పూర్వకంగా శ్రీయుత జిల్లా ఎండోమెంట్స్ ఆఫీసర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఏలూరు వారికి అందజేయగలరు

గ్రామం: వీరభద్రపురం
తేది: 16-06-2025

తనిఖీదారు
దేవాదాయ ధర్మాదాయ శాఖ
ఏలూరు, ఏలూరు జిల్లా

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి తాడేపల్లిగూడెం
E.P.No. 17/2024 in O.S.No. 9/2010

Between:
Reddy and Reddy Imports and Exports
Rep by its Partnar G. Sri Rama Reddy ...D.H.R
And
Bobbili Ganga Raju ...J.D.R
J.D.R : Bobbili Ganga Raju, S/o. Peddayya, age: 55 Years, R\o Bavaipalem (V), Nidamarru Mandal, Eluru Dist, A.P.

పై నెంబరు దావాలో మీ పై D.H.R కోర్టులో పిటిషన్ వేసియున్నారు. పై నెంబరు దావాలోని నోటీసులు ఉద్దేశ్యపూర్వకంగా బొబ్బిలి గంగరాజు గారు Aviod చేసియున్నారనియు శ్రీ కోర్టు వారు **ది. 26-06-2025వ సం॥రం తేదీన** వాయిదా వేసియున్నారు. సదరు **ది. 26-06-2025వ సం॥రం తేదీన** కోర్టులో **ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల శ్రీ కోర్టు వారు చట్టప్రకారం మీ పరోక్షముగా తీర్మానించెదరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కొత్తపల్లి వీర వెంకట సత్యనారాయణ
తాడేపల్లిగూడెం — అడ్వకేట్, తాడేపల్లిగూడెం
తేది:15-06-2025 — సెల్: 94401 43195

IN THE COURT OF THE V ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISON) AT VIJAYAWADA
I.A. NO. 1445/2024 IN O.S. NO. 2002/2024

Between :
M/s N.S. Textiles, Rep by its Prop: A.Hemalatha W/o Siva Kumar, Chittinagar, Vijayawada-1. ..... Plaintiff / Petitioner
AND
R1) Sri Kanikicharla Hari Rama Venkata Hemanth S/o late Prasad : a/a 34 years, R/o D.No. 78-14-9, Karicharlavari veedi, Eastern Street, Eluru.
R2) Kanikicharla Likitha, D/o (late) Prasad, a/a 28 years, D.No. 78-14-9, Karicharla vari Veedhi, Eastern Street, Eluru.
.... Defendants / Respondents

పై నెంబరు గల పిటీషన్ యందు మీరు రెస్పాండెంట్స్ అయివున్నారు. రెస్పాండెంట్స్ అయిన 1) కనికిచర్ల హరిరామ వెంకట హేమంత్ 2) కనికిచర్ల లిఖిత యొక్క హాజరు నిమిత్తం వాయిదా : ది.1-7-2025వ తేదీన ఉన్నది. కావున సదరు ది.1-7-2025వ తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, లేదా మీ న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొన వలెను. లేనియెడల మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 1-7-2025
ఉదయం 10-30 గం.లకు.

ఎస్.మల్లేశ్వరరావు, అడ్వకేట్,
సెకండ్ ఫ్లోర్, ఫస్ట్ ఛాంబర్, ఎ.ఎస్.రామారావు హాల్,
గవర్నర్‌పేట, విజయవాడ- 520 002.
సెల్ : 99480 92949

IN THE COURT OF THE V ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISON) AT VIJAYAWADA
O.S. NO. 2002/2024

Between :
M/s N.S. Textiles, Rep by its Prop: A.Hemalatha W/o Siva Kumar, Chittinagar, Vijayawada-1. ..... Plaintiff
AND
D1) Sri Kanikicharla Hari Rama Venkata Hemanth S/o late Prasad : a/a 34 years, R/o D.No. 78-14-9, Karicharlavari veedi, Eastern Street, Eluru.
D2) Kanikicharla Likitha, D/o (late) Prasad, a/a 28 years, D.No. 78-14-9, Karicharla vari Veedhi, Eastern Street, Eluru.
.... Defendants 1 & 2

పై నెంబరు గల దావాలో మీరు ప్రతివాదులై వున్నారు. ప్రతివాదులైన 1) కనికిచర్ల హరిరామ వెంకట హేమంత్ 2) కనికిచర్ల లిఖిత యొక్క హాజరు నిమిత్తం వాయిదా : ది.1-7-2025వ తేదీన ఉన్నది. కావున సదరు ది.1-7-2025వ తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, లేదా మీ న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 1-7-2025
ఉదయం 10-30 గం.లకు.

ఎస్.మల్లేశ్వరరావు, అడ్వకేట్,
సెకండ్ ఫ్లోర్, ఫస్ట్ ఛాంబర్, ఎ.ఎస్.రామారావు హాల్,
గవర్నర్‌పేట, విజయవాడ- 520 002.
సెల్ : 99480 92949

BEFORE THE HON`BLE DEPTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT ELURU, ELURU DIST
A.A.C.F.No. 101/2024

Between:
Margadarsi Chit Fund (P) Limited, Eluru Br
.....Petitioner/Disputant
And
Yellapu Bhanu Chandra And Others
.....Respondents/Opponents
Op2: Mamuduri Mahankali, S/o. M. Anandam, Hindu, Male, a/a 52 Years, Occ : Employee, W/as Junior Assistant, % Assistant Commissioner of State Tax, Commerical Tax Office, N.R.Pet, Eluru, R/o D.No. 13-34, Behind Boys Convent, Xavier Nagar, Eluru, Eluru Dist.
Op3: Padilam Srinivasa Rao, S/o P. Rama Chandram, Male, a/a 49 Years. Occ : Business, Mg. Partner: M/s Balaji Consulting and Engineers, Shobha Complex, N.R.Pet, Eluru, R/o D.No. 25-11-33, Sinivasa Nilayam, Beside Allanani House, N.R. Pet, Eluru, Eluru Dist.

పై నెంబరు దావాలో వాదికి రావలసిన బాకీ రాబట్టుకునేందుకు గాను, మీ పై దావా దాఖలు చేసియున్నారు. పై దావాలో మీరు అపోనెంట్స్ అయి ఉన్నారు. మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.24-06-2025 న తేదికి** వాయిదా వేసినారు. కావున ఆ రోజున **ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయముగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో సదరు దావా మీకు పరోక్షంగా తీర్మానించబడును.

ఫోర్ మెన్/బ్రాంచ్ మేనేజర్
డిస్ప్యూటెంట్ కంపెనీ, ఏలూరు, ఏలూరు జిల్లా

BEFORE THE HON`BLE DEPTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT ELURU, ELURU DIST
A.A.C.F.No. 102/2024

Between:
Margadarsi Chit Fund (P) Limited, Eluru Br
.....Petitioner/Disputant
And
Mohammed Akhil Rehman And Others
.....Respondents/Opponents
Op3: Sunkara Mohana Krishna, S/o. S. Venkateswarlu, Hindu, Male, a/a 30 Years, Prop : M/s Sri Lakshmi Vinayaka Rice Stores, Santha Market street, Chebrolu, Unguturu (M), Eluru Dist., R/o D.No. 5-28, Near IBM Church, Chenchula Colony, Venkatapuram, Eluru (M), Eluru Dist.,
Op6: Kaki Krishna Rao, S/o K. Rama Krishna, Hindu, Male, a/a 33 Years. Occupation : Sanitary Works and Business, Adavikolanu Vari Street, Powerpet, Eluru, R/o D.No. 22b-1-23/1, Adavikolanu Vari Street, Beside: Reliance Petrol Bunk, Power pet, Eluru, Eluru Dist.

పై నెంబరు దావాలో వాదికి రావలసిన బాకీ రాబట్టుకునేందుకు గాను, మీ పై దావా దాఖలు చేసియున్నారు. పై దావాలో మీరు అపోనెంట్స్ అయి ఉన్నారు. మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.24-06-2025 న తేదికి** వాయిదా వేసినారు. కావున ఆ రోజున **ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయముగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో సదరు దావా మీకు పరోక్షంగా తీర్మానించబడును.

ఫోర్ మెన్/బ్రాంచ్ మేనేజర్
డిస్ప్యూటెంట్ కంపెనీ, ఏలూరు, ఏలూరు జిల్లా

BEFORE THE HON`BLE DEPTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT ELURU, ELURU DIST
A.A.C.F.No. 28/2024

Between:
Margadarsi Chit Fund (P) Limited, Eluru Br
.....Petitioner/Disputant
And
M/S Padma Agencies And Others
.....Respondents/Opponents
Op1: M/S Padma Agencies Rep By Prop: MR.CH. Indra Kumar, occupation: Business, D.No. 22c-15-4, Station road, power pet, Eluru, W.G. Dist.,
Op4: Chitturi Vara Lakshmi, W/o CH. Indra Kumar, Hindu, Female, a/a 51 Years. Occupation : Business, Prop: M/S Alankrit Boutique, F.No. 107, Sri Sai Gayatri Towers, Opp: Deloitte, Nanakramaguda, Hyderabad, R/o Flat No. 403, Block - A3, Trendset Winz Apartment, Near: Wipro circle, Nanakramguda, Hyderabad
Op5: Chitturi Venkata Lakshmi, W/o CH. Surya Rao, Hindu, Female, a/a 76 Years. Occupation : Profession, Agriculture & Palm Oil Gardens, Garlamadugu, Pedavegi (M), & Dea, W.G.Dist, R/o Flat. No. 403, Block - A3, Trendset Winz Apartment, Near: Wipro circle, Nanakramguda, Hyderabad

పై నెంబరు దావాలో వాదికి రావలసిన బాకీ రాబట్టుకునేందుకు గాను, మీ పై దావా దాఖలు చేసియున్నారు. పై దావాలో మీరు అపోనెంట్స్ అయి ఉన్నారు. మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.24-06-2025 న తేదికి** వాయిదా వేసినారు. కావున ఆ రోజున **ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయముగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో సదరు దావా మీకు పరోక్షంగా తీర్మానించబడును.

ఫోర్ మెన్/బ్రాంచ్ మేనేజర్
డిస్ప్యూటెంట్ కంపెనీ, ఏలూరు, ఏలూరు జిల్లా